క్లుప్తంగా

ముమ్మరంగా వరి నాట్లు



మునగపాక తంపరమూల ప్రాంతంలో నారు తీస్తున్న కూలీలు

మునగపాక: మండల వ్యాప్తంగా ఖరీఫ్ వరి సాగు ముమ్మరంగా సాగుతోంది. కొన్ని చోట్ల వరినాట్లు పూర్తి కాగా.. మరికొన్ని చోట్ల నారు తీసే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. కూలీల సహాయంతో ఉడుపులు చేపట్టేందుకు రైతులు చర్యలు చేపట్టారు. సాగునీటి కాలువలపై ఆధారపడి సాగు చేపట్టే రైతులు బిజీగా ఉన్నారు.

మరిడిమాంబ పండగ రేపు

మునగపాక: తిమ్మరాజుపేటలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అదే రోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఘనంగా పోతురాజుబాబు పండగ



పోతురాజుబాబును దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో మంగళవారం పోతురాజుబాబు పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి పోతురాజుబాబును దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు దాసరి అప్పారావు, మళ్ల సంజీవరావు, ఇల్లా నాగేశ్వరరావు, నరాలశెట్టి సూర్యనారాయణ, మద్దాల వీరునాయుడు, శరగడం జగన్నాథరావు, బొడ్డేడ శ్రీనివాసరావు తదితరులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దొడ్డి బుజ్జి, గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రాజునాయుడు ఏర్పాట్లు చేశారు.

హాకీ క్రీడాకారులకు ఫిట్‌నెస్ శిక్షణ



నక్కపల్లిలో విద్యార్థులకు ఫిట్‌నెస్ శిక్షణ ఇస్తున్న హాకీ క్లబ్ ప్రతినిధులు

నక్కపల్లి: స్థానిక బీఎస్ హాకీ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఫిట్‌నెస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్టు హాకీ క్లబ్ ప్రతినిధులు సూరిబాబు, తాతాజీ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఎల్.వి.రమణ ఆధ్వర్యంలో ఇక్కడ తర్ఫీదు పొందే విద్యార్థులకు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. గురువారం జిల్లా కేంద్రంలో క్రీడాకారులతో భారీ ర్యాలీ, క్రీడా పోటీలు నిర్వహించనున్నారు.



ప్రత్యేక చట్టాలు చేయాలి

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన దాడి ఘటన దారుణం. ఇలాంటివి పునరావృతం కాకుండా మహిళా వైద్యుల కోసం ఆస్పత్రుల వద్ద పోలీసులతో ప్రత్యేక భద్రత కల్పించాలి. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందితో నిఘా నిరంతరం అవసరం. ప్రాణాలు కాపాడడానికి నిత్యం పరితపించే వైద్యులపై కొందరు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. వైద్యులు, సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి.

– డాక్టర్ సుతరపు శ్రీకాంత్, ప్రైవేటు వైద్యుడు, యలమంచిలి





మనోధైర్యం దెబ్బతింటోంది..

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన అత్యంత అమానుషం. ఇలాంటి ఘటనలతో మహిళా వైద్యుల మనోధైర్యం దెబ్బతింటోంది. ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వద్ద రాత్రి సమయాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. అన్ని వేళల్లో సేవలందించే మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించి భరోసా ఇవ్వాలి.

– ఎస్ సుజాత, ఫిజియోథెరపిస్ట్, యలమంచిలి

–యలమంచిలి రూరల్

భయపెడుతున్న 'గాలికుంటు'

- పశువుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- ముమ్మరంగా గాలికుంటు వ్యాధి టీకాలు
- సెప్టెంబర్ 18 వరకు టీకాల ప్రక్రియ కొనసాగింపు



మునగపాకలోని ప్రభుత్వ పశు వైద్యశాల



పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న సిబ్బంది

మునగపాక: వ్యవసాయంతో పాటు పశుపోషణ, పాడి పరిశ్రమ రంగం రోజురోజుకూ విస్తరిస్తోంది. వర్షా కాలంలో వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కాలంలో పశువులకు రకరకాల వ్యాధులు సోకుతుంటాయి. తద్వారా పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గడం, దుక్కి పశువులు పని సామర్థ్యం కోల్పోవడం, పెయ్యలు ఎదకు రాకపోవడం ముఖ్యంగా ప్రాణ నష్ట సమస్యలు ఎక్కువగా ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో వర్షా కాలంలో పశువులకు సోకే వివిధ వ్యాధులు, వాటి నివారణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

వర్షా కాలంలో ప్రధానంగా గాలికుంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. దీంతో పాల దిగుబడి తగ్గుముఖం పడుతుంది. ఇందు కోసం గాలికుంటు వ్యాధి సోకకుండా ఉండేలా టీకాలు వేసే కార్యక్రమం ముమ్మరంగా చేపడుతున్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద టీకాల కార్యక్రమం చేపట్టారు. సెప్టెంబర్ 18వ తేదీలోగా టీకాల ప్రక్రియ పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఆ దిశగా అధికారులు టీకాల కార్యక్రమం శత శాతం అమలయ్యేలా చర్యలు చేపట్టారు.

టోల్ ఫ్రీ నంబర్ 1962

పశువులకు సీజన్‌లో వచ్చే అంటువ్యాధుల సమస్యలు నివృత్తి చేసుకునేందుకు వీలుగా జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా 1962 టోల్ ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రధానంగా గాలికుంటు వ్యాధికి సంబంధించి ఎటువంటి సమస్య అయినా నేరుగా ఫోన్ చేసేందుకు అవకాశం కల్పించారు.

వ్యాధి లక్షణాలు

- తీవ్రమైన జ్వరం, నీరసం
- కొద్దిపాటి ఎండకు కూడా పశువులు ఇబ్బందులు పడడం.
- దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గడం.

నష్టాలు..

- పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం
- పాలు తాగే దూడల్లో మరణాలు
- చికిత్స విషయంలో నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవడం

టీకాల వల్ల కలిగే లాభాలు

- వ్యాధి సోకిన పాడి పశువుల్లో తగ్గే పాల ఉత్పత్తిని పెంచవచ్చు.
- వ్యాధి సోకిన దుక్కి ఎద్దుల్లో పని సామర్థ్యం పెంపు
- దూడల్లో మరణాలు తగ్గించి, ఆరోగ్యంగా ఎదుగుదలకు దోహదం
- పశువుల గుర్తింపునకు చెవి పోగు వేయడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుంది.

టీకాతో ఎంతో మేలు



ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. ఇందు కోసం ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నాం. టీకాలు వేయడం ద్వారా పాల దిగుబడులు తగ్గకుండా ఉండడంతో పాటు ఆరోగ్యకర ఇబ్బందులు తలెత్తవు. వచ్చే నెల 18 వరకు గ్రామాల్లో పశువులకు టీకాల కార్యక్రమం కొనసాగుతుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

–లావేటి ప్రదీకుమార్, మండల పశు వైద్యాధికారి

ఏపీటీఎఫ్ రథసారథులకు నివాళి



ఏపీటీఎఫ్ ప్రతినిధులు రామకృష్ణయ్య, సింహాద్రప్పడు చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

మునగపాక(అచ్యుతాపురం): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఏపీటీఎఫ్ రథసారథులు రామకృష్ణయ్య, సింహాద్రప్పడు ఎంతో కృషి చేశారని యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ ఫాతిమా మోబిన్ బేగం కొనియాడారు. దివంగత రామకృష్ణయ్య, సింహాద్రప్పడుల వర్ధంతి సందర్భంగా మంగళవారం అచ్యుతాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా బేగం మాట్లాడుతూ ఏపీటీఎఫ్ యూనియన్ బలోపేతంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం శ్రమించిన వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు నాగేశ్వరరావు, మూర్తి, ప్రభాకర్, అరుణకుమారి, విజయకుమారి, రామానుజులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్.రాయవరం: క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ అన్నారు. రేవుపోలవరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీపై అవగాహన అవసరమన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించి మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు.

గ్రామసభల్లో రూ.10 కోట్ల పనుల గుర్తింపు

నక్కపల్లి: ఇటీవల జరిగిన గ్రామసభల్లో మండలంలో రూ.10 కోట్లు విలువైన పనులు గుర్తించి ప్రతిపాదనలు తయారు చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉపాధి హామీ గ్రామ సభల్లో ఎక్కువగా రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. రూ.10 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



జానకయ్యపేటలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి కృపావతి

నక్కపల్లి: పశువులకు సోకే సీజనల్ వ్యాధులను నివారించేందుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జానకయ్యపేట పశువైద్యాధికారి డాక్టర్ కృపావతి కోరారు. మంగళవారం ఆమె జానకయ్యపేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి పశువులకు టీకాలు వేశారు. పశువులకు ఈ సీజన్‌లో బ్రూసెల్లోసిస్, గాలికుంటు వ్యాధులు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందన్నారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు.

డ్రైవర్లకు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: సుదూర ప్రాంతాలకు ప్రయాణించే ట్రక్ డ్రైవర్లు తమ ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని పెదపల్లి అర్బన్ హెల్త్ క్లినిక్ వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి సూచించారు. మంగళవారం ఘర్ ఉత్సవ్‌లో భాగంగా 16వ నంబరు జాతీయ రహదారి పక్కనున్న ఎర్రవరం భారత్ పెట్రోలియం అవుట్ లెట్ వద్ద ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలు వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు, స్థానిక ద్విచక్ర వాహన చోదకులకు వివిధ రకాల సాధారణ వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. ఇలాంటి వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యురాలు వైష్ణవి కోరారు. ఈ కార్యక్రమంలో భారత్ పెట్రోలియం అవుట్ లెట్ ఆపరేటర్ కె.చంద్రశేఖర్‌రావు, కోఆర్డినేటర్ వివేక్, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఈశ్వరరావు, పెదపల్లి అర్బన్ హెల్త్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గణనాథుడికి వెండి తొండం బహూకరణ



దాతలు కానుకగా ఇచ్చిన వెండి తొండం

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి వీవర్స్ కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయకుడికి హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు 500 గ్రాముల వెండి తొండాన్ని కానుకగా సమర్పించారు. గొట్టుముక్కల శిరీష్‌కుమార్ వర్మ, సురేఖ దంపతులు ఈ వెండి తొండాన్ని తయారు చేయించి బహూకరించారు. మంగళవారం ఆలయంలో ప్రధానార్చకుడు పి.వి.అప్పలాచార్యులు పూజలు చేసి, కమిటీ సభ్యులకు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

మునగపాక: ఎటువంటి రికార్డులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మునగపాక పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాక ఇందిరమ్మ కాలనీ నుంచి జగనన్న కాలనీకి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రికార్డులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు.

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

మునగపాక: ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు కోరారు. మునగపాకలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం పార్టీ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 25 వరకు సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సంపర భార్గవాచార్యులు, పార్టీ నాయకులు మళ్ల కాళేశ్వరరావు, బొడ్డేడ భాస్కరరావు, కాండ్రేగుల తేజస్విని, గణేష్, కన్నయ్య, జోగినాయుడు, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 2 నుంచి సభ్యత్వ నమోదు

నక్కపల్లి: వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కోసూరు శ్రీను కోరారు. మంగళవారం సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 రోజుల పాటు ఈ సభ్యత్వ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంఈవో శివనాయుడు

మునగపాక: పాఠశాలల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంఈవో శివనాయుడు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్కూల్ కమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పాటుపడాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించేలా బోధన సాగాలన్నారు. ఎంఈవో వేణుగోపాలరావు, పలువురు హెచ్‌ఎంలు, సీఆర్పీలు లక్ష్మీనారాయణ, గోవింద, అచ్యుత కృష్ణ, నూకేష్, సత్తిబాబు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అధ్వానంగా పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డు



శిథిలావస్థలో పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డు అధ్వానంగా తయారైంది. దారి పొడవునా రాళ్లు తేలిపోయాయి. దీంతో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు రాకపోకలకు నానా యాతన పడుతున్నారు. కాకరాపల్లి నుంచి మోడల్ స్కూల్‌కు వెళ్లే దారిలో రాళ్లు తేలిపోవడంతో నడవడానికి కూడా వీల్లేకుండా తయారైంది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

వసతి గృహాల్లో అధికారుల తనిఖీలు



కొండకర్లలోని ఇచ్ఛా ఫౌండేషన్ ఆశ్రమంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలంలోని వికలాంగ ఆశ్రమంతో పాటు కొండకర్లలోని ఇచ్ఛా ఫౌండేషన్ ఆశ్రమంలో మంగళవారం రాత్రి మండల స్థాయి అధికారులు తనిఖీలు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా చోట్ల వసతి, భోజన సదుపాయాలు, బాత్‌రూమ్‌లు, పారిశుధ్యం వంటి పరిస్థితులను గమనించారు. నర్సీపట్నం నియోజకవర్గంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ బుచ్చిరాజు తెలిపారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ నీరజ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం



ఆలయాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందిస్తున్న నాగులాపల్లి ఎంపీటీసీ సభ్యుడు కాశీ సురేష్

మునగపాక: వెనకబడిన దేవాలయాల అభివృద్ధికి తనవంతు సాయంగా నాగులాపల్లి ఎంపీటీసీ(వైఎస్సార్‌సీపీ) సభ్యుడు మళ్ల కాశీ సురేష్ మంగళవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. స్నేహాంజలి యూత్ ఆధ్వర్యంలో గతంలో నాగులాపల్లిలోని పలు ఆలయాల అభివృద్ధికి దాతల నుంచి రూ.8 లక్షల మేర విరాళాలు సేకరించారు. మంగళవారం పోతురాజుబాబు పండగ సందర్భంగా సురేష్ తన వంతు సాయంగా ఈ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ దొడ్డి బుజ్జి, గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రాజునాయుడు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



బాల్ కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

మునగపాక: వాడ్రాపల్లిలో మంగళవారం మ్యూజికల్ చైర్, బాల్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. పెతకంశెట్టి జోగినాయుడు గ్రంథాలయం వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు 29న బహుమతులు అందజేస్తామని గ్రంథాలయం గౌరవాధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల వరహా నరసింగరావు, మళ్ల జోగినాయుడు, మళ్ల కన్నంనాయుడు, మొల్లేటి రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ రవిశంకర్ మృతి తీరని లోటు



సంతాప సభలో మాట్లాడుతున్న జిల్లా అధికారి బి.సుజాత

పాయకరావుపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్ మృతి తీరని లోటు అని ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి బి.సుజాత అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్ సంతాప సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి జిల్లా అధికారి బి.సుజాత పూలమాల వేసి అంజలి ఘటించారు. రవిశంకర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి, ఎలమంచిలి, కె.డి.పేట, లాలంకొడూరు కళాశాలల ప్రిన్సిపాళ్లు కె.శ్రీహరి, కె.శ్రీదేవి, ఎం.విజయ్‌కుమార్, ఎం.స్వామినాయుడు, కె.శైలజ, స్థానిక కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వమ్మవరంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ఎస్.రాయవరం: వమ్మవరం శ్రీమహాలక్ష్మి అమ్మవారి జాతర నిర్వహణకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం జాతరను పురస్కరించుకుని మంగళవారం రాత్రి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు అమలాపురం, తుని, విశాఖపట్నం, అనకాపల్లి, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి సుమారు 23 జట్లు పాల్గొన్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.